క్లుప్తంగా

గెలుపు కోసం సహకరించాలి



సర్పంచ్‌తో మాట్లాడుతున్న సమన్వయకర్త చిన హనిమిరెడ్డి

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని కుర్రవానిపాలెం సర్పంచ్, సీనియర్ న్యాయవాది నాదెండ్ల దశరథరామయ్యను నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి మంగళవారం సర్పంచ్ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి మాట్లాడారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎంపీపీ శాంతిబాయి

మార్టూరు: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మండలంలోని అన్ని గ్రామాల్లో పూర్తి చేయాల్సిన పెండింగ్ పనులను త్వరితగతిన పరిష్కరించుకుందామని ఎంపీపీ భుక్యా శాంతిబాయి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆమె అధికారులు ప్రజా ప్రతినిధులతో మాట్లాడారు. ఈసందర్భంగా ఆమె గ్రామాల్లోని విద్యుత్, రోడ్లు, తాగునీరు డ్రైనేజీ, శానిటేషన్ తదితర మౌలిక వసతుల ఏర్పాటు గురించి స్థానిక సంబంధిత అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో జి. నితిన్, సూపరింటెండెంట్ బసవరాణి, ఏవో వీ కిరణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి గ్రామ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 37 మంది ఎంపిక

చీరాల అర్బన్: పట్టణంలోని వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలోని జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 37 మంది ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ సీహెచ్ రమణమ్మ తెలిపారు. శ్రీసిటీలోని నియో లింక్ కంపెనీ నిర్వహించిన జాబ్‌మేళాకు మొత్తం 62 మంది హాజరుకాగా వీరిలో 37 మంది ఎంపికయ్యారు. ఎంపికైన వారు ఫిబ్రవరి 4లోపు ఉద్యోగంలో చేరుతారని, వీరికి నెలకు రూ.14200 వేతనం ఉంటుందని కళాశాల జేకేసీ మెంటార్ ఎస్వీ సుబ్బారెడ్డి తెలిపారు.

పొలాల్లో రాగి వైరు చోరీ

బల్లికురవ: వ్యవసాయ మోటార్లకు సంబంధించిన రాగివైరు చోరీపై కొమ్మినేనివారిపాలెం రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం రాత్రి గ్రామం నుంచి వలపర్ల వెళ్లే రోడ్డులోని గోగినేని వేణుబాబు, కొమ్మినేని హనుమంతరావు, దర్శి రామారావు, వెల్లలచెరువు కృష్ణ, ఏటూరి అంజిబాబు పొలాల్లోని వైరు చోరీ చేశారు. మంగళవారం ఉదయం పొలాలకు వెళ్లిన రైతులు మోటార్లు బయటకు తీసి ఉంచటంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తిరిగి వైరు అమర్చుకోవాలంటే రూ. 5 వేల నుంచి 10 వేలు ఖర్చు అవుతుందని, దొంగతనాలకు అడ్డుకట్ట వేయాలని రైతులు వేడుకుంటున్నారు.

గ్యాస్ లీకై ఇల్లు దగ్ధం



పూర్తిగా కాలిపోయిన గృహోపకరణాలు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): గ్యాస్ లీకై ఇల్లు దగ్ధమైన ఘటన మంగళవారం మండలంలోని వెల్లలచెరువు గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై శివకుమార్ వివరాల మేరకు.. గ్రామంలో నన్నెం రాజారావు ఇంటిలో అతని భార్య వంట చేస్తుండగా పెద్దగా శబ్దం వినిపించటంతో గ్యాస్ లీకేజిని గుర్తించిన ఆమె భయంతో పరుగెత్తుతూ బయటకు వచ్చింది. బయటకు వచ్చిన కొద్దిసేపటికి మంటలు వ్యాపించి ఇల్లు కాలిపోయింది. స్థానికులు నీరు చల్లి మంటలను అదుపు చేశారు. రూ.4 లక్షల వరకు నష్టం కలిగి ఉండవచ్చని, సర్వం కోల్పోయి కట్టుబట్టలతో మిగిలామని బాధితులు వాపోతున్నారు.

ఆరోగ్య ప్రదాత సీఎం జగన్

- చీరాలలో మూడో అర్బన్ హెల్త్ సెంటర్
- రూ. 1 కోటితో రూపుదిద్దుకున్న ఆరోగ్య కేంద్రం
- త్వరలో అందుబాటులోకి రానున్న వైద్య, ఆరోగ్య సేవలు



పాపపాపరాజు తోటలోని అర్బన్ హెల్త్ సెంటర్

చీరాల రూరల్: గతంలో చిన్నచిన్న అనారోగ్య సమస్యలు వస్తే చాలు ఏ జిల్లా కేంద్రానికో లేదా పెద్ద పట్టణాలకో తరలివెళ్లేవారు. అలాంటి పరిస్థితుల్లో నుంచి బయటపడాలని సీఎం జగన్ మోహన్‌రెడ్డి వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. జనాభ ప్రాతిపదికన ఆసుపత్రులు కట్టిస్తూ పేదలపాలిట దేవుడిగా నిలిచారు జగనన్న. ఇప్పటికే ఇంటింకి వైద్యం, ఫ్యామిలీ డాక్టర్, 104 వాహనాలతో వైద్యాన్ని ఇంటి ముంగిటకు చేర్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. ప్రజలు కోరుకునే ఏ ప్రభుత్వమైనా ప్రజలకు ఉచితంగా నాణ్యమైన మెరుగైన ఆరోగ్య సేవలు, విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్య అందించాలని కోరుకుంటారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రస్తుతం అదే చేసింది. విద్యార్థులు సక్రమంగా చదువుకునేందుకు ఏ మాత్రం దిగులు చెందకూడదనే ఉద్దేశంతో నాడు-నేడు పేరుతో కోట్ల రూపాయలతో స్కూళ్లను ఎంతో సుందరంగా తీర్చిదిద్దారు. మరో పక్క ప్రజల ఆరోగ్యానికి మెరుగైన ఉచిత సేవలు అందించేందుకు కూడా కోట్లాది రూపాయలు వెచ్చించింది. అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమిక హెల్త్ క్లీనిక్‌లు ఏర్పాటు చేసేందుకు సమాయత్తమైంది. చీరాలలో కూడా రూ. 1 కోటి రూపాయల వ్యయంతో అర్బన్ హెల్త్ సెంటర్ పేరుతో నూతన భవనాన్ని నిర్మించింది. త్వరలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు సిద్ధమయ్యింది.

కోటి రూపాయల వ్యయంతో..

స్థానిక బీఎస్‌ఎన్‌ఎల్ ప్రధాన కార్యాలయం పక్కన మున్సిపల్ స్థలంలో సుమారుగా రూ.1 కోటి వెచ్చించి అర్బన్ హెల్త్ సెంటర్ పేరుతో నిర్మాణం ప్రారంభించారు. ఈ హెల్త్ సెంటర్‌ను స్థానిక ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణమూర్తి భూమిపూజ నిర్వహించి ప్రారంభించారు. ప్రస్తుతం వైద్యశాలకు కావలసిన అన్ని హంగులతో అత్యాధునికతతో కూడిన విధంగా నిర్మాణం రూపుదిద్దుకుంటోంది. వైద్యుల గదులు, పేషంట్స్ వార్డులు, వైద్య పరికరాల గదులు, మరుగుదొడ్లు వంటి వాటని ఎంతో ఆధునికంగా రూపొందిస్తున్నారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడడం లేదు. ఇప్పటికే అనేక ధపాలుగా ఎమ్మెల్యే కరణం అనేకసార్లు పరిశీలించి సంబంధిత కాంట్రాక్టర్‌కు నాణ్యత విషయమై అనేక సూచనలు కూడా చేశారు.

ఇప్పటికే అందుబాటులో రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు..

చీరాల పట్టణ ప్రజలకు నిత్యం వైద్య సేవలు అందుబాటులో ఉంటున్నాయి. ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాలతో పాటు వైకుంఠపురంలోని అర్బన్ హెల్త్ సెంటర్, మరియమ్మపేటలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లు ప్రజలకు నిత్యం అందుబాటులో వైద్య సేవలందిస్తున్నాయి. దాదాపుగా చీరాల పట్టణం మొత్తాన్ని కుందేరు వద్దగల ప్రభుత్వ ప్రాంతీయ వైద్యశాల సేవలు అందిస్తోంది. ఇక్కడ ప్రజలకు కావాల్సిన అనేక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి. తల్లీబిడ్డల సీమాంక్ సెంటర్, కిడ్నీ డయాలసిస్ సెంటర్, రక్తనిధి కేంద్రం, ప్రమాదాల బారినపడిన సమయంలో మంచి వైద్య నిపుణులతో సర్జరీలు, మేల్, ఫిమేల్ వార్డులు రోగులకు నిత్యం అందుబాటులో ఉంటున్నాయి. రైలు పట్టాల ఆతలవైపు ఉన్న దాదాపు 10 మున్సిపల్ వార్డుల జనాభాకు వైకుంఠపురం, మరియమ్మపేట అర్బన్ హెల్త్ సెంటర్లు కవర్ చేస్తున్నాయి. అయినప్పటికి మెరుగైన వైద్య సేవలందించాలని తలంపుతో మూడో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మించింది. ఇద్దరు వైద్యులతో పాటు డ్యూటీ నర్సులు, టెక్నిషియన్లు, ల్యాబ్ అసిస్టెంట్లు, సిబ్బంది అందుబాటులో ఉంటారు. ఇప్పటికే ఈ ప్రాథమిక వైద్యశాలకు కేటాయించిన వైద్య సిబ్బంది తమ సేవలను పాత ప్రసాద్ థియేటర్ వద్ద కొనసాగిస్తున్నారు. ప్రజలకు వైద్య సేవలు అందించే విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, తీసుకుంటున్న చర్యలపై ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

విద్యతోనే భవిష్యత్‌లో ఉన్నత స్థానం



ఉపకార వేతనాలు అందిస్తున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వెంకటేష్

- నాయీబ్రాహ్మణ విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ
- పాల్గొన్న నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్

చీరాల టౌన్: విద్యతోనే ఉన్నతస్థానం లభిస్తుంది.. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నతస్థాయికి చేరి సమాజాభివృద్ధిలో పాలుపంచుకోవాలని చీరాల వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కరణం వెంకటేష్ సూచించారు. మంగళవారం రాత్రి పట్టణంలోని రోటరీక్లబ్ భవనంలో చీరాల-పేరాల పట్టణ నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నాయీబ్రాహ్మణ విద్యార్థులకు ఉపకార వేతనాలు, విద్యాసామగ్రి, 2024 క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయీబ్రాహ్మణులు అందరం ఐక్యంగా ఉండి తమ పిల్లలను చక్కగా ఉన్నత చదువులు చదివించాలన్నారు. విద్యాభివృద్ధికి సీఎం జగన్ అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని చక్కగా చదువుకుని జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. ప్రతీ ఏటా రూ.10 వేలు ఆర్థిక సాయం అందించడంతో పాటుగా దేవస్థాన పాలకమండలిలో పదవులు కల్పించిన సీఎం జగన్‌కు నాయీబ్రాహ్మణులు అందరూ అండగా నిలిచి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఉపకార వేతనాలను అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, డాక్టర్ గుంటుపల్లి హైమా సుబ్బారావు, డాక్టర్ తాడివలస దేవరాజ్, సంఘం అధ్యక్షులు వెంకటేశ్వర్లు, పెద్దలు బోస్‌బాబు, వెంకటస్వామి, శంకర్, సుబ్బారావు, శివ,సత్యనారాయణ, పున్నయ్య, పున్నారావు, రాజు, రాఘవయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు అభివృద్ధి పనులకు శ్రీకారం

- తక్షణమే స్పందించిన నియోజకవర్గ సమన్వయకర్త చిన హనిమిరెడ్డి



పొక్లెయిన్‌తో అభివృద్ధి పరుస్తున్న రోడ్డు

బల్లికురవ: బల్లికురవ-మార్టూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు గోతులు చిల్లచెట్లు పెరగటంతో అధ్వానస్థితికి చేరింది. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈరోడ్డులోని నక్కబొక్కలపాడు, నాగరాజుపల్లి మధ్య నాలుగు కిలో మీటర్ల అభివృద్ధి గత ప్రభుత్వ హయాంలో నోచుకోలేదు. ఈ ప్రభుత్వంలో మూడేళ్ల అభివృద్ధి పరిచేందుకు నిధులు మంజూరు చేశారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ గ్రానైట్ భారీ వాహనాల రాకపోకలకు మెయింటెన్స్ ఇవ్వలేక పనులు చేపట్టడానికి ఆసక్తి చూపలేదు. సోమవారం బల్లికురవ వచ్చిన అద్దంకి వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త పానెం చిన హనిమిరెడ్డికి రోడ్డు పరిస్థితిని వలంటీర్లు విన్నవించారు. వెంటనే మరమ్మతులు, జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని నక్కబొక్కలపాడు సర్పంచ్ ధూళిపాళ్ల రామయ్యకు సూచించారు. మంగళవారం పొక్లెయిన్‌తో గ్రామంలోని ప్రాథమిక పాఠశాల నుంచి గోతులు పూడ్చి రోడ్డుకు ఇరువైపుల పెరిగిన చిల్ల చెట్లను తొలగించారు. ఐదు రోజుల్లో హనిమిరెడ్డి సహకారంతో అభివృద్ధి పరిచి రాకపోకలకు పూర్తిగా ఇబ్బందులు తొలగిస్తామని సర్పంచ్ వివరించారు.

మహాత్ముని సేవలు చిరస్మరణీయం



కొడవలివారిపాలెంలో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, చిన్నారులు



చిన్నబజార్ సెంటర్లో గాంధీజీకి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు



గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్యులు

- ఘనంగా మహాత్మాగాంధీ వర్ధంతి

కారంచేడు/చినగంజాం: జాతిపిత మహాత్మా గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని ప్రధానోపాధ్యాయుడు పావులూరి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని కుంకలమర్రు మెయిన్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన గాంధీజీ వర్ధంతి, అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చిన్నారులతో మాట్లాడుతూ అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్య్రాన్ని తీసుకొచ్చిన ఘనత బాపూజీకి దక్కుతుందన్నారు. గాంధీజీని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. నేటి బాలలే రేపటి పౌరులుగా తీర్చబడటానికి నాంది పలికింది ఆయనేనన్నారు. ఆయన స్ఫూర్తితోనే గ్రామాభివృద్ధే దేశాభివృద్ధిగా రాష్ట్ర ప్రభుత్వం కూడా గ్రామాభివృద్ధికి గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చిందన్నారు. కొడవలివారిపాలెం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు, నందిగుంటపాలెం ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం ప్రసాద్ గాంధీజీ చిత్రపటానికి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు పీ బాబు, కే బాబ్జి, ఎస్ వీరమస్తాన్, వై శ్రీకృష్ణ, బీ శ్రీనివాసరావు, కే రాజు, పీ భానుప్రియ, సీహెచ్ తిమోతీ, వై కోటయ్య, పీ శ్రీనివాసులు, రాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.



పంగులూరులో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

➤ మహాత్మా గాంధీ వర్ధంతిని పర్చూరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక కొట్ల బజార్‌లోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి మామిడిపాక హరిప్రసాదరావు, తవ్వా భావన్నారాయణ, కాసా అజయ్, పొత్తూరి వెంకటేశ్వరరావు, టీ కమలాకరరావు, లింగేశ్వరరావు, రంగా తదితరులు పాల్గొన్నారు.

వేటపాలెం: మహాత్మా గాంధీజీ ఆశయాలను అందరూ అనుసరించాలని పట్టభద్రుల సంఘం అధ్యక్షుడు ప్రత్తి వెంకటసుబ్బారావు పేర్కొన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రాంగణంలోగల గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. చిన్న బజార్ సెంటర్‌లో గల గాంధీజీ విగ్రహానికి ఆర్యవైశ్య ప్రముఖులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో వాసవి క్లబ్స్ ఇంటర్‌నేషనల్ ట్రెజరర్ వల్లంపట్ల మురళీకృష్ణమూర్తి, కో ఆర్డినేటర్ చుండూరి సురేష్, సంఘం సభ్యులు కోటి స్వామి గుప్తా, సెక్రటరీ కే శివకుమారి, చుండూరి రామారావు, శ్రీరామ్ గోవర్ధన, పొన్నూరి రమేష్, సురేష్‌బాబు, నూకల సీతా మహాలక్ష్మి పాల్గొన్నారు.

జే.పంగులూరు: జాతిపిత మహాత్మ గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం పంగులూరులోని రోటరీ భవనం వద్ద గాంధీజీ విగ్రహానికి రోటరీ క్లబ్ సభ్యులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రోటరీ డిస్ట్రిక్ చైర్మన్ వీరరాఘవయ్య, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు సచివాలయం, ఆర్బీకే భవనాల ప్రారంభం

బల్లికురవ: మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో బుధవారం సాయంత్రం రూ. 65 లక్షలతో నిర్మించిన సచివాలయం, రైతుభరోసా ప్రారంభం తోపాటు పల్లెపల్లెకు హనిమిరెడ్డి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ ప్రధానార్యదర్శి కె.అంజనీ ప్రసాదరెడ్డి మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి పార్టీ అద్దంకి నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి హాజరవుతారని మండలస్థాయి అధికారులు గ్రామాలవారీగా ప్రజాప్రతినిధులు పాల్గొని జయప్రదం చేయాని కోరారు. అనంతరం కోటవారిపాలెం గ్రామంలోని ఎస్సీ కాలనీలో నిర్మించిన సామాజిక భవనం చుట్టూ నిర్మించిన కాంపౌండ్ వాల్‌ను ప్రారంభిస్తారని ప్రసాదరెడ్డి వివరించారు.

ట్రాఫిక్ నియమాలతో ప్రమాదాలకు అడ్డుకట్ట

చీరాల టౌన్: విధిగా ట్రాఫిక్ నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట పడుతుందని ఒన్ టౌన్ సీఐ ఎం.శేషగిరిరావు సూచించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు మంగళవారం పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవనంలో ఆటో, కారు, లారీ, బస్సు, వ్యాన్ డ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఒన్‌టౌన్ సీఐ పి. శేషగిరిరావు మాట్లాడుతుతూ ద్విచక్ర వాహనాలు నడిపే వారు విధిగా హెల్మెట్లు ధరించాలని, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపరాదన్నారు. సీఐతో ట్రాఫిక్ ఎస్సై గోపి, ట్రాఫిక్ ఏఎస్సై చిన్నపోతుల శ్రీను, ట్రాఫిక్ పోలీసులు, వాహనాల డ్రైవర్లు ఉన్నారు.

పోయిన సొమ్ము గంటలో అందజేత

అద్దంకి రూరల్: సొమ్ము పోయిందని ఫిర్యాదు ఇచ్చిన గంటలోనే రికవరి చేసి బాధితురాలికి అందజేశారు పోలీసులు. సీఐ పీ. కృష్ణయ్య తెలిపిన వివరాల మేరకు.. పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం గురుజవోలు గ్రామానికి చెందిన జాజుల అంజమ్మ మంగళవారం మండలంలోని శింగరకొండలోని ప్రసన్నాంజనేయ దేవస్థానానికి వచ్చి పూజలు చేసింది. అనంతరం ప్రసాదాలు కొనుగోలు చేసే సమయంలో పర్సు పోయింది. అంజమ్మ అద్దంకి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఐ ఆదేశాల ఐడీ పార్టీ అనిల్‌కుమార్ శింగరకొండ వెళ్లి రికవరీ చేశారు. పర్సులో 4 సవర్ల బంగారపు నల్లపూసల గొలుసు, రూ. 2400 నగదు ఉన్నాయి. సీఐ అంజమ్మకు అందజేశారు. దీంతో బాధితురాలు కృతజ్ఞతలు చెప్పింది.

నిత్యవసరాలు పంపిణీ

చీరాల రూరల్: వాకర్స్ ఇంటర్ నేషనల్ ఎన్‌ఆర్‌అండ్ పిఎం హైస్కూలు చీరాల వాకర్స్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం స్థానిక హైస్కూలు క్రీడా మైదానంలో రెండు అనాథశ్రమాలకు నిత్యవసరాలు పంపిణీ చేశారు. వాకర్స్ సభ్యులు మాదల చినసుబ్బారావు, గ్రంథి నరసింహారావు పాపరాజు తోటలోని రామస్తంభం ఆశ్రమానికి, విఠల్‌నగర్‌లోని చైతన్య మనోవికాశ కేంద్రానికి నిత్యవసరాలు అందజేశారు. అలానే ఈనెల 31 నుంచి హైస్కూలు క్రీడా మైదానంలో షూటింగ్ బాల్ జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ వైద్యుల విభాగం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బాబురావు ఆధ్వర్యంలో నిర్వహించనున్న షూటింగ్ బాల్ జాతీయస్థాయి పోటీల నిర్వహణకు సంబంధించి ఖర్చుల నిమిత్తం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ బాబురావుకు రూ. 5,000 అందజేశారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పోలుదాసు రామకృష్ణ, చారుగుళ్ల గురుప్రసాద్, సుధాకర్, సభ్యులు పాల్గొన్నారు.

రెండు కుటుంబాలకు భువనేశ్వరి పరామర్శ

యద్దనపూడి: టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి చేపట్టిన నిజం గెలవాలి యాత్ర మంగళవారం బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గంలో కొనసాగింది. చంద్రబాబు అరెస్టు నేపథ్యంలో మనోవేదనకు గురై మృతి చెందిన పర్చూరు మండలం చిననందిపాడు గ్రామంలో ముప్పా సింగారావు, యద్దనపూడి గ్రామంలో టిక్కం నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, ఎమ్మెల్సీ అనూరాధ పాల్గొన్నారు.

చీరాల ఎంపీడీవో గుంటూరుకు బదిలీ

చీరాల టౌన్: చీరాల మండల పరిషత్ అభివృద్ధి అధికారి, వేటపాలెం ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేస్తున్న కె.నేతాజీ గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అధికారుల బదిలీల్లో భాగంగా ఎంపీడీవో గుంటూరు జిల్లాకు బదిలీ కావడంతో మంగళవారం చీరాల ఎంపీడీవో కార్యాలయంలో వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. చీరాలకు ఎంపీడీవోగా శోభారాణి నియమితులయ్యారని సమాచారం. అనంతరం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు, ఎస్టీవో భాగ్యలక్ష్మీ, కార్యాలయం సూపరింటెండెంట్ శ్రీనివాసులు, పంచాయతీల సెక్రటరీలు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

జే.పంగులూరు: మండల పరిధిలోని తూర్పు కొప్పెరపాడు గ్రామంలో మంగళవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. వైద్య శిబిరంలో 373 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో బీపీ, షుగరు, హెచ్‌ఐవీ, మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి రక్త పరీక్షలు నిర్వహించారు. కంటి పరీక్షకు 56, గుండె సంబంధిత వ్యాధులు 26, ఆయుర్వేద వైద్య శిబిరానికి 34 మంది వైద్య అందించినట్లు ఆయుర్వేద వైద్యులు కృష్ణకుమార్ తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు శివచెన్నయ్య, బాల రాజేశ్వరి, సూర్‌వైజర్ మదర్‌షా, హరిబాబు, సర్పంచ్, ఎంపీటీలు సభ్యులు నాయకులు పాల్గొన్నారు.

దాతల సహకారం అభినందనీయం



విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తున్న దాతలు

పర్చూరు (చినగంజాం): దాతల సహకారం అభినందనీయం అని, పాఠశాల అభివృద్ధికి ఉప్పుటూరు గ్రామస్తులు అందిస్తున్న సహకారం మరచిపోలేమని హెచ్‌ఎం జీ వసుంధరాదేవి అన్నారు. మంగళవారం పాఠశాల ఆవరణలో ఆమె అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఇంజినీరు పాలేరు సుబ్బారావు జీవించి ఉన్న సమయంలో పాఠశాలకు ఏర్పాటు చేసిన ఫిక్స్‌డ్ రూ.1 లక్షకు సంబంధించి వడ్డీని వారి కుమారుడు డాక్టర్ పాలేరు శ్రీనివాస్ చేతుల మీదుగా గతేడాది 10 వ తరగతి ఫలితాల్లో పాఠశాల స్థాయిలో మెరిట్ సాధించిన మొదటి ముగ్గురు విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు ఎన్ త్రినాథ్ రూ 5 వేలు, ఎస్‌కే బషీరుల్లా రూ.3 వేలు, ఐ ఈశ్వరికి రూ.2 వేలు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాలేరు సుబ్బయ్య, పాలేరు శ్రీను, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నియోజకవర్గ క్రికెట్ విజేత పర్చూరు జట్టు



క్రికెట్ విజేతలతో అధికారులు

కారంచేడు: ఆడుదాం ఆంధ్రా క్రీడా క్రికెట్ పోటీల్లో నియోజకవర్గస్థాయిలో పర్చూరు జట్టు విజయం సాధించింది. మంగళవారం మండల కేంద్రమైన కారంచేడు డాక్టర రామానాయుడు స్టేడియంలో ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలలో ఫైనల్స్‌ను కారంచేడు, పర్చూరు జట్ల మధ్యన నిర్వహించారు. ఈ పోటీల్లో కారంచేడు జట్టుపై పర్చూరు జట్టు విజయం సాధించారు. దీంతో విన్నర్స్‌గా పర్చూరును, రన్నర్స్‌గా కారంచేడు జట్లను అధికారులు ప్రకటించి వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో పర్చూరు, కారంచేడు ఎంపీడీఓలు ప్రద్యుమ్నకుమార్, లక్ష్మీనారాయణ, ఈఓపీఆర్డీ ఆర్ రమేష్‌బాబు, పీడీలు ఉదయభాస్కర్‌రెడ్డి, వీరయ్య, కే ప్రసాద్, పీ శ్రీనివాసులు, ఎం వెంకటసుబ్బారావు, వెంకట్రావు, కోటేశ్వరరావు, రెండు మండలాల క్రీడాకారులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో ఎండుతెగులుకు చెక్



శనగ రైతులతో మాట్లాడుతున్న శాస్త్రవేత్త ఓబయ్య

మేదరమెట్ల: పిల్లిపెసర, జనుము, జీలుగ వంటి పచ్చిరొట్ట పైర్లు సాగుచేసుకొని పొలంలో కలిసే విధంగా దున్నుకోవాలని తరువాత శనగ పంటను సాగు చేసుకోవడం ద్వారా ఎండు తెగులును అరికట్టవచ్చని డాట్ శాస్త్రవేత్త డాక్టర్ ఓబయ్య అన్నారు. కొరిశపాడు మండలంలోని దైవాలరావూరు గ్రామంలో శనగ పంటను ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ భూమిలో కర్బన శాతం తగ్గినప్పుడు పంటలో ఎండు తెగులు వస్తుందన్నారు. దాన్ని అధికమించాలంటే సేంద్రీయ ఎరువులను ఎక్కువగా వినియోగించుకోవాలన్నారు. పంట మార్పిడి పద్ధతులను పాటించడం తప్పనిసరిగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, వీఏఏ ప్రత్యూష, గ్రామ రైతులు పాల్గొన్నారు.